


# నవభూమి

## జిల్లా అనుబంధం

25 ఆగస్టు,2025 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in

# కాటేసిన కామాంధులు



- గమ్యం చేరుస్తామని నమ్మ బలికి అమాయక బాలికను సామూహికంగా కాటేశారు
- కాపాడి సంరక్షించిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ
- పాల్వంచ రూరల్‌లో జీరో ఎఫ్ఐఆర్
- కేసు ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ

**కొత్తగూడెం ఆగస్టు 24 నవభూమి ప్రతినిధి:**ఓ అమాయక గిరిజన బాలిక అమాయకత్వాన్ని, ఆమె గమ్యం చేరేందుకు అన్నా సాయం చేయండని అడిగితె ఓ ట్రాలీ డ్రైవర్, అతనితో పాటు మరో వ్యక్తి కలిసి అత్యాచారం చేసి, ఆమెకు ఏ మాత్రం సంబంధం లేని ప్రాంతంలో ఆమె స్పృహ లో లేని సమయంలో పడేసి వెళ్లిన సంఘటన పాల్వంచ మండలం జగన్నాధపురంలోని పెద్దమ్మగుడి ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. అత్యాచారం జరిగిన ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని ఏడుగురాళ్లపల్లి సమీపంలో ఉండొచ్చని బాలిక స్త్రీ శిశు సంక్షేమ అధికారులకు చెప్పిన వివరాలను బట్టి తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఈ అఘాయిత్యం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని బోదగూడెం నుండీ శుక్రవారం రాత్రి ఆ బాలిక ఆంధ్రప్రదేశ్‌లోని తన స్వంత ఇంటికి వెళుతుంది. కుంటలో తనను తమ ఊరిలో దింపమని ఆ బాలిక అన్నయ్య అంటూ ట్రాలీ డ్రైవర్ ను కోరింది. అప్పటికే ట్రాలీలో మరో వ్యక్తి ఉన్నాడు. చట్టి....ఎడుగురాళ్లపల్లి మధ్యలో ట్రాలీ డ్రైవర్ డ్రింక్ ఇస్తే బాలిక తాగింది.డ్రింక్ లో మత్తు మందు కలిపి ఇవ్వడంతో ఆమె స్పృహ కోల్పోయింది. అదను చూసి ఇద్దరు ఆమె పై అత్యాచారం చేశారు. శనివారం పాల్వంచ మండలం జగన్నాథంపురం దగ్గర పెద్దమ్మ గుడి ఏరియా వద్ద గాయాలతో పడి ఉండగా, ఆమె పరిస్థితి చూసి స్థానికులు చైల్డ్ లైన్‌కు సమాచారం ఇచ్చారు. పాల్వంచ స్త్రీ శిశు సంక్షేమ అధికారులు ఆమెను కొత్తగూడెం తరలించారు. బాలిక సంరక్షణ గృహం లో ఉంచారు. ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పాల్వంచ రూరల్ పోలీసులు కొత్తగూడెం మాతా శిశు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. అనంతరం రూరల్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస్తున్నారని సమాచారం. బాలిక బంధువులు వస్తున్నారని ఆమెను వారికి అప్పగిస్తామని కొత్తగూడెం రూరల్ సీడీపీఓ లక్ష్మి ప్రసన్న చెప్పారు.

# డీఈవోగా శ్రీజ నేడు బాధ్యతల స్వీకరణ



**ఖమ్మం-నవభూమిబ్యూరో:** ఇప్పటి వరకు విద్యాశాఖ అధికారులకు మార్గదర్శనం చేసిన అధికారి.. నిత్యం సమీక్షలతో నూతన లక్ష్యాలను నిర్దేశించిన బాస్.. పాఠశాల విద్యలో జరుగుతున్న కార్యక్రమాలను పర్యవేక్షణ చేసిన ఐఏఎస్ ఆఫీసర్ అదనపు కలెక్టర్ ఇక నుంచి విద్యాశాఖాధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా డాక్టర్ పీ శ్రీజ సోమవారం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించబోతున్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొం టున్నాయి. ఇందుకు సంబంధించి డీఈవో కార్యాలయం అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. సాధారణంగా ఫైల్స్‌తో నిండిపోయి ఉన్న డీఈవో చాంబర్‌లో ఫైల్స్‌ను అక్కడి నుంచి తీసి గదిని కూడా శుభ్రపరిచారు. పలు జిల్లాల్లో అదనపు కలెక్టర్లకే డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

**సమస్యలున్నాయి.. అనుభవం ఉంది..**

జిల్లాలో అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి డాక్టర్ పీ శ్రీజ విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించారు. డీఈవోతోపాటు సెక్టోరల్స్ అధికారులతో నేరుగా మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకుంటూ సూచనలు చేసేవారు. స్పౌజ్ బదిలీల విషయంలో, ఉపాధ్యాయుల సర్దుబాటులో ఆమె నేరుగా పరిశీలించాకే ఆమోదించారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనూ నియోజకవర్గస్థాయిలో ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించి ప్రతి అంశంపై చర్చించి తనకు పూర్తి అవగాహన ఉందని స్పష్టం చేశారు. అయినప్పటికీ విద్యాశాఖలో పలు సమస్యలు వెంటాడుతున్నాయి.

విద్యాసంవత్స రం ప్రారంభమై మూడునెలలు కావొస్తున్నా రెండో జత యూనిఫాం రాలేదు.. జూన్, జూలైలో ఉద్యోగ విరమణ చేసిన ఉపా ధ్యాయుల స్థానంలో ఇప్పటికే సర్దుబాటు చేయకపోవ డంతో చాలా స్కూల్స్‌లో బోధన ప్రారంభం కాని సబ్జెక్టులు ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట నిర్వహిస్తున్న పనుల్లో నాణ్యత లేమిపై ఆరోపణలున్నాయి. వీటితోపాటు చాలా సమస్యలున్నాయి.

# ట్రాక్టర్ కింద పడి బాలుడి దుర్మరణం

- తండ్రి నడుపుతున్న రొటోవేటర్‌లో పడి.. ఐదేళ్ల బాలుడి దుర్మరణం
- కన్న తండ్రి కళ్లెదుటే ముక్కలుముక్కలైన కుమారుడు
- సెలవుదినం కావడంతో తండ్రితో కలిసి చేనుకు వెళ్లిన కొడుకు
- కొద్దిసేపట్లోనే తునాతునకలై విగతజీవిగా ఇంటికి..
- ఖమ్మం జిల్లా కూసుమంచి కొత్తతండాలో విషాదం



**ఖమ్మం-నవభూమిబ్యూరో**

తాను కన్న కుమారుడే తన చేతిలో ఎన్నటికీ కానరాని లోకాలకు వెళ్తాడని బహుశా ఏ తండ్రీ ఊహించి ఉండడు. తన కన్నయ్యే (కొడుకు) సరదాగా తనతోపాటు చేనుకు వస్తానంటే ఏ తండ్రి మాత్రం వద్దనగలడు? కానీ ఆ సరదానే తన కన్నయ్యను తనకు దూరం చేస్తుందని ఆ తండ్రి కలలో కూడా కలగని ఉండడు. కానీ ఘోరం జరిగింది. విధి వక్రీకరించింది. తాను పక్కనుండగా తన కన్నయ్యపై ఈగను కూడా వాలనీయనన్న ఆ తండ్రి ధైర్యం, తన తండ్రి తన పక్కనుండగా తనను మరేమీ తాకలేదన్న భరోసా.. రెండూ విధి ముందు నిజం కాలేకపోయాయి. తనవెంట వస్తానంటూ మారం చేసిన కొడుకును ముద్దుచేస్తూ తీసుకెళ్లిన ఆ తండ్రి.. కొద్ది నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా తీసుకొచ్చిన విషాదం.. కూసుమంచి మండలంలోనిది..

ఐదేళ్లుగా అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు తండ్రి సమక్షంలోనే, తండ్రి నడుపుతున్న రొటోవేటర్‌లో పడి తునాతునకలై దుర్మరణం చెందిన విషాదకర ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కూసుమంచి మండలం లోక్యాతండా పరిధిలోని కొత్తతండాకు చెందిన వడ్తియా రాంబాబు - దీపిక దంపతులకు భువనేశ్వర్ (5) అనే కుమారుడు, భువనేశ్వరి అనే కుమార్తె (కవలలు) ఉన్నారు. కుమారుడు భువనేశ్వర్ కూసుమంచిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతు న్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. తండ్రి రాంబాబు సాయంత్రం సమయంలో చేను దున్నేందుకు ట్రాక్టర్‌కు రొటోవేటర్‌ను లింక్ చేసుకొని తోలుకుంటూ బయలుదేరాడు. అయితే, తాము కూడా వస్తామంటూ కుమారుడు భువనేశ్వర్, అతడి స్నేహితుడైన మరో బాలుడు మారం చేయడంతో వారిని ట్రాక్టర్ వెనుక రొటోటేటర్‌పై కూర్చోబెట్టుకొని చేను వద్దకు వెళ్లాడు. అక్కడ రొటోవేటర్ పైభాగంలో కుమారుడు భువనేశ్వర్‌ను, అతడి స్నేహితుడైన మరో బాలుడిని కూర్చోబెట్టుకొని రాంబాబు తన చేను చదును చేస్తున్నాడు.

ఈ క్రమంలో కుమారుడు భువనేశ్వర్ ప్రమాదవశాత్తూ జారి ఒక్కసారిగా రొటోవేటర్ కింద పడిపోయాడు. క్షణాల్లోనే అతడి తల, మొండెం, ఇతర శరీర భాగాలు ముక్కలుముక్కలై వేరువేరుగా పడిపోయాయి. ఆ వెంటనే భువనేశ్వర్ పక్కన కూర్చున్న బాలుడు గట్టిగా కేకలు వేయడంతో రాంబాబు వెనక్కు తిరిగి చూశాడు. అప్పటికే అతడి కుమారుడి దేహమంతా తునాతునకలైంది. వాటన్నింటినీ తండ్రి ఒక్క దగ్గర చేర్చి బోరున విలపించాడు. తాను కన్న కొడుకునే తన చేతులారా పోగొట్టుకున్నానంటూ తల్లడిల్లిపోయాడు. ఈ విషాదకర ఘటనను చూసిన గ్రామస్తులంతా కంటతడి పెట్టుకున్నారు.

# కథల పోటీల్లో ఇల్లెందు వాసికి ప్రథమ బహుమతి

**ఇల్లెందు-నవభూమి:** ఉరిమెళ్ల ఫౌండేషన్ వారు అక్షరాల తోవ వారి ఆధ్వర్యంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కథా రచయితలకు ఖమ్మంలోని బోడెపూడి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఇల్లెందు రచయిత సుదర్శనం రంగనాథ్ రచించిన మైలంటని మహాలక్ష్మి కథకు ప్రథమ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సాహితీ పురస్కార సభలో రంగనాథ్ ను ఉరిమెళ్ల ఫౌండేషన్ వారు సన్మానించారు.

మూమెంటో, ప్రోత్సాహక బహుమతి అందించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ఈ సంస్థ నిర్వహించిన కథా పోటీలలో గతంలో ఎక్కిరింపు కథకు ప్రథమ బహుమతి వచ్చిందని, తెలుగు రాష్ట్రాలలో సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న ఉరిమెళ్ల ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు.



## టేకులపల్లి మండల పిడిఎస్‌యు నూతన కార్యవర్గం ఎన్నిక




**టేకులపల్లి ఆగస్టు 24 నవభూమి ప్రతినిధి:** టేకులపల్లి జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన టేకులపల్లి మండలం పిడిఎస్యు 23వ మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, మండలంలోని విద్యా సంస్థలలో ఉన్న సమస్యలపై నూతన కార్యాచరణతో పలు తీర్మానాలను ఈ మహాసభ ఆమోదించిందని జిల్లా కార్యదర్శి జె గణేష్ తెలిపారు. మండల నూతన కమిటీ అధ్యక్షురాలిగా జి.రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా బి ఉష, ప్రధాన కార్యదర్శిగా ఎ.లోకేష్, సహాయ కార్యదర్శిగా ఉపేందర్, కోశాధికారిగా బి.దీపిక, సభ్యులుగా సాయికిరణ్, వి.తీలక్, దిలీప్, అజయ్ మొత్తం 9 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## వినాయక కర్ర పూజాలో పాల్గొన్న యూసుఫ్



**కొత్తగూడెం ఆగస్టు 24 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం గాజులరాజం బస్తీ 57వ డివిజన్ పోచమ్మతల్లి ఆలయంలో యూత్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయకుని కర్ర పూజ కార్యక్రమం మాజీ వార్డ్ కౌన్సిలర్ సిపిఐ త్రీ టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్, గడ్డం రాజయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ పిల్లలు పెద్దలు అందరూ ఎంతో ఇష్టంగా చేసుకునే పండగ వినాయకుడి పండగ అని తొమ్మిది రోజులు గణపతి పూజలను అందుకొని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలను సమకూర్చాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోషమ్మ టెంపుల్ ఛైర్మెన్ గడ్డం ప్రభాకర్, గడ్డం సతీష్, దాసరి కుమార్, కాటుకూరి రాయాలింగు, ఇండ్ల రామస్వామి, పిల్లి తదితరులు పాల్గొన్నారు

## నేడు ప్రజావాణి: కలెక్టర్ జితేష్ వి పాటిల్




**కొత్తగూడెం ఆగస్టు 24 నవభూమి ప్రతినిధి:** కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ప్రజలు వారి వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని చెప్పారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# మట్టి గణపతితోనే పూజించండి

- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నివారించండి
- మట్టి గణపతులను పూజిస్తే భక్తి ముక్తి శక్తి
- భద్రాచలం ఎమ్మెల్యే వెంకటరావు



**భద్రాచలం ఆగస్టు 24 నవభూమి ప్రతినిధి:** పార్వతీదేవి అమ్మవారు శరీరం శుభ్రం చేసుకున్న నలుగు మట్టి నుండి వినాయకుడు ఉద్భవించాడని మన పురాణాలు చెబుతున్నాయని భద్రాచలం కుమ్మర సంఘం శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అన్నారు. ఆదివారం మట్టి గణపతుల విగ్రహాలనే



పూజించండి అనే కరపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉన్నది లేకుంటే ప్రకృతి ప్రళయానికి ఎవరైనా శిరస్సు వంచాల్సిందే అన్నారు. పర్యావరణ పరిరక్షణ భావితరాల సంరక్షణ పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భావితరాలను సంరక్షిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ భద్రాచలం సభ్యులు గంగాధర వీరయ్య, భద్రాచలం కుమ్మరి సంఘం డివిజన్ నాయకులు విజ్జిగిరి రాజా కిరణ్, గంగాధర సతీష్, సద్దనపు సత్యనారాయణ, వి. నరేష్, జల్లారపు సునీల్, సగ్గెం లక్ష్మణరావు, రెల్లి తాతారావు, కొలిచలం నవీన్, విజ్జిగిరి రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలన్ని నెరవేర్చాలి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

**కారేపల్లి, నవభూమి , ఆగష్టు 24:** వ్యవసాయ యంత్రీకరణతో వ్యవసాయ పనులు తగ్గాయి. ఏడాదికేడాది ఉపాధి హామీ పథకం కు నిధులు కుదిస్తుండటంతో కూలీలకు ఉపాధి కరువతుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ లు తెలిపారు. ఆదివారం కారేపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ జరిగింది. ఈమహాసభలో వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా వ్యవసాయ కూలి రేట్లు పెరగటం లేదన్నారు. వ్యవసాయ కూలీలు ఐక్యతతోనే కూలీ రేట్లు పెంచుకోవటం సాధ్యమన్నారు. కూలి రేట్లు పెంపుతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకంకు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తుందని, పథకం అమలులో కొత్త నిబంధనలు విధించి కూలీలకు ఉపాధి దూరం చేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నంలో భాగంగా మోడి ప్రభుత్వం రూ. 50.60 లక్షల కోట్ల బడ్జెట్ లో కేవలం రూ.69 వేల కోట్లు కేటాయించి ఉపాధి కూలీలకు కూలి గిట్టుబాటు కాకుండా అన్యాయం చేస్తుందని విమర్శించారు . పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని అమలు జరపటంలో ప్రభుత్వాలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయని, ఏళ్ల తరబడి పోడు సాగు చేస్తున్న గిరిజనేతరులకు నేటికి హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. పోడు సాగు చేస్తున్న గిరిజనేతరులకు హక్కు పత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. పోడు సాగు పై ఆంక్షల తో పేదలను వ్యవసాయం దూరం చేసే ప్రయత్నం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్లాంటేషన్ పేరుతో పేదల భూము లాక్కొని, ప్రత్యామ్నాయ భూమి చూపించకుండా ఫారెస్ట్, పోలీస్ నిర్బంధాలు ప్రయోగిస్తుందన్నారు. వ్యవసాయ కార్మికుల భద్రత ,రక్షణ, కోసం సమగ్ర కూలి చట్టం తేవాలని, ఆ చట్టం అమలుకి గ్రామపంచాయతీలను వేదికలుగా నిర్ణయించాలన్నారు. కేరళ తరహాలో కూలీలందరినీ పంచాయతీ పరిధిలో నమోదు చేసి పనులన్నింటికీ రేట్లు నిర్ణయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, మహిళలకు నెలకు రూ.2500 హామీ అమలు ఊసే ఎత్తటం లేదన్నారు. ప్రజలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. పేదలకు నిత్యావసర వస్తువులను అందించే చౌకదుకాణాలను కేవలం బియ్యం పంపిణి కేంద్రాలు మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌకదుకాణాల ద్వారా నిత్యావస వస్తువులు అన్ని అందించాలని డిమాండ్ చేశారు.

వ్యకాస మండల కమిటి ఎన్నిక వ్యవసాయ కార్మిక సంఘం నూతనకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు కేసగాని ఉపేందర్, కార్యదర్శి యనమనగండ్ల రవి లను ఎన్నుకున్నారు.

ఈకార్యక్రమంలో వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు యర్రా శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణ కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, తుమ్మోజు రాంమ్మూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు, ఐద్వా కార్యదర్శి కే.ఉమావతి, కరపటి రాంబాయి, సూరబాక ధనమ్మ చల్ల మల్లమ్మ పాల్గొన్నారు




## 26న టియు డబ్ల్యూజే (ఐజేయు)

# ఖమ్మం నగర కమిటీ కార్యవర్గ సమావేశం



**ఖమ్మం, నవభూమి ఆగస్టు 24:** ఈనెల 26 తేదీన టియు డబ్ల్యుజె(ఐజేయు) ఖమ్మం నగర కమిటీ కార్యవర్గ సమావేశం జడ్పీ గెస్ట్ హౌస్ లో నిర్వహిస్తున్నట్లు నగర కమిటీ అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కమిటీ తొలి నగర కమిటీ కార్యవర్గ సమావేశం ఖమ్మం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం గం10.30 సమావేశం ఏర్పాటు చేసేమని ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణు గోపాల్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సామినేని మురారి, నర్వనేని వెంకట్రావ్, జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వర రావు, కార్యదర్శి మైసా పాపా రావు, కోశాధికారి నాగండ్ల శివ, మాజీ జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు, స్తంభాద్రి సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు భూపాల్, కార్యదర్శి మహేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నామ పురుషోత్తం, శీలం శ్రీనివాసు, కోశాధికారి కళ్యాణ్ చక్రవర్తి, మరియు వివిధ పత్రికల బ్యూరోలు, స్టాపర్లు హాజరు కానున్నారని తెలిపారు. ఈ సమావేశానికి మిత్రులందరూ సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# దోమల నివారణకు లాల్య తండాలో ఫాగింగ్



**కామేపల్లి,నవభూమి,ఆగస్టు 24 :** కామేపల్లి మండలం లాల్య తండాలో ఆదివారం రాత్రి ముమ్మరంగా ఫాగింగ్ నిర్వహించారు.ఎంపీడీవో జీ.రవీందర్, ఎంపీఓ పి.ప్రభాకర్ రెడ్డి,పంచాయతీ స్పె షల్ ఆఫీసర్ బి.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ కార్యదర్శి విక్రమ్ సారథ్యంలో పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు గాను ఫాగింగ్ నిర్వహించారు.వర్షాకాలం దృష్ట్యా ప్రజలు తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మురికి నీరు నిల్వ ఉండ కుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. తాజా ఆహార పదార్థాలను తీసుకోవా లని,సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శి విక్రమ్ ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది,స్థానికులు భూక్యా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ డైరెక్టర్ ఇంట్లో యూరియా స్వాధీనం

**వరంగల్–నవభూమి:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఓ సొసైటీ డైరెక్టర్ 26 యూరియా బస్తాలను దారి మళ్లించి ఇంట్లో దాచేశాడు. రైతుల ఫిర్యాదుతో అతని బండారం బయటపడింది. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపెల్లి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాయపర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా తిర్మలాయపెల్లిలో గోదాం ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి లారీలో 444 యూరియా బస్తాలు రాగా, అందులో 26 బస్తాలను సొసైటీ డైరెక్టర్ దొంతరబోయిన యాదగిరి తన ఇంట్లో దింపుకున్నాడు. మిగతా బస్తాలను గోదాంలో నిల్వ ఉంచారు. రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారు. అయితే, యూరియా బస్తాలు అయిపోగా, టోకెన్లు మిగలడంతో అధికారులు కంగుతిన్నారు. యూరియా బస్తాలు డైరెక్టర్ యాదగిరి ఇంట్లో ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రా రెడ్డి, ఏవో వీరభద్రం, ఏఈవోలు అతని ఇంటికి వెళ్లి చూడగా బస్తాలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని యాదగిరిపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఏవో తెలిపారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో యూరియా కోసం రైతుల కష్టాలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి.

ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేశారు. నంగునూరు మండలం పాలమాకుల, రాంపూర్, మగ్దుంపూర్, ముండ్రాయి, ఓబులాపూర్, బద్దిపడగ, నర్మెట్ట, వెంకటాపూర్ తదితర గ్రామాల రైతులు యూరియా కోసం బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదిక వద్ద టోకెన్లు ఇస్తే, సొసైటీ వద్ద యూరియా బస్తాలు అందజేశారు. పాలమాకులలో పోలీస్ పహారాలో అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో రైతులు శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు యూరియా కోసం పడిగాపులు కాశారు. చెప్పులు లైన్‌లో పెట్టి దాదాపు 500 మంది వేచి చూశారు. చివరికి 410 యూరియా బస్తాలు రావడంతో అధికారులు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. దీంతో దాదాపు 300 మంది రైతులు తీవ్ర నిరాశతో వెనుతిరిగాల్సి వచ్చింది. ఖమ్మం జిల్లా కారేపల్లి సొసైటీ ఎదుట భారీ సంఖ్యలో రైతులు ఆదివారం తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. 500 మందికి పైగా రైతులు క్యూలో నిల్చుని ఉండగా.. 335 బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. దీంతో అధికారులు, సొసైటీ సిబ్బంది రైతులకు నచ్చచెప్పి.. ముందుగా క్యూలో ఉన్న వారికి యూరియా బస్తాలు ఇచ్చి పంపించారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1972 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక

**ఖమ్మం, నవభూమి ఆగస్టు 24:** ఎస్ ఆర్ బి జె ఎన్ ఆర్. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ 1972 నుంచి 1975 వరకు బిఎస్సి (బిజెడ్సీ) పూర్వ విద్యార్థులు 50 సంవత్సరాల తర్వాత గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కొరకు ఖమ్మంలోని గ్రాండ్ గాయత్రి హొటల్ నందు బంకెట్ హాల్ లో 27 మంది పూర్వ విద్యార్థులు మరియు వారి సహధర్మ చారిణులు మొత్తం 45 మంది కలుసుకున్నారు. ఉదయం 8:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు పాత రోజులు గుర్తుకు తెచ్చుకొని, ఒకరినొకరు పలకరించుకొని, మెమెంటోలు ఒకరికొకరు బహుకరించుకున్నారు. హౌసీ లాంటి ఆటలు ఆడారు. ఖమ్మంలో నివసిస్తున్న ఎనిమిది మంది సహ పూర్వ విద్యార్థులు యరమళ్ళ సుదర్శన రావు (రిటైర్డ్ ఎస్బిహెచ్మేనేజర్) ఆళ్ల వెంకట రావు (రిటైర్డ్ పారా మెడికల్ ఆఫీసర్) బండి సత్యనారాయణ (రిటైర్డ్ జూడుసియల్ ఆఫీసర్) లక్ష్మణ రావు (రిటైర్డ్ ఎల్ఐసి డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్) రామారావు, వెంకటేశ్వర్లు,సుదాకర్ చర్చించుకుని, దూర ప్రాంతాల్లో ఉన్న వారిని ఫోన్ ద్వారా సంప్రదించి ఈ కలయికను ఏర్పరచు కున్నామని ఆర్గనైజింగ్ కమిటీ కోఆర్డినేటర్ వై సుదర్శన రావు



మరియు కో ట్రెజరర్స్ బండి సత్యనారాయణ, ఆళ్ల వెంకట్రావు తెలియజేశారు. ఈ కలయిక గురించి అందరూ చాలా ఆనందపడ్డారు. ఇలాంటి కలయిక ప్రతి సంవత్సరం జరుపుకోవాలని హైదరాబాద్ లో నివసిస్తున్న వాళ్ళు 2026 లో అక్కడ జరుపుకోవాలని నిర్ణయించుకున్నారు.

# నరేంద్రమోడి ఓటు చోరీ- రాహుల్ పాదయాత్రకు మద్దతు ఇవ్వండి

- తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కమిటీ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్
- జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభం



**మేడ్చల్- ఆగస్టు 24:(నవభూమి ప్రతినిధి )**మేడ్చల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కమిటీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకు ముందు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి ఏర్పాటుచేసిన ప్రచార రథాలను మీనాక్షి నటరాజన్ ప్రారంభించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి కాంగ్రెస్పార్టీజెండానుఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఓట్లు చోరీ చేసి నాలుగు సార్లు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. తమ పార్టీకి అనుకూలంగా లేని ఓట్లను తొలగించి పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటును ఓటర్ జాబితాలో చేర్పించి లబ్ధి పొంది నాలుగు సార్లు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. నరేంద్ర మోడీ ఓట్ల చోరీ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పాదయాత్రకు ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడు జరగనంత అభివృద్ధి సీఎం రేవంత్రెడ్డిహయాంలోజరుగుతుందని , అభివృద్ధి, సంక్షేమం సమపాలలో ఉందని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని హామీలను నెరవేర్చే ప్రయత్నంలో సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని, ఇప్పటికే మహిళలకు ఇచ్చిన హామీలో ఉచిత బస్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలుగత10సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లుదాం అనుకుంటే బిజెపి





బీఆర్ఎస్ పార్టీతో లోపాయి కారి ఒప్పందం చేసుకొని అడ్డంకులు సృష్టిస్తుందని ఆరోపించారు. నరేంద్ర మోడీ ఓట్ల చోరీ వ్యవహారంలో ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు రేవంత్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల పై ప్రచారం చేసేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఐదు ప్రచార రథాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కమిటీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ మోడీ ఓట్ల చోరీ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పాదయాత్రకు ప్రతి ఒక్కరూ పద్ధతి ఇవ్వాలన్నారు. ఇదేవిధంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఓట్ల చోరీ వ్యవహారాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు ప్రచార రథాలను ఏర్పాటు చేసిన డిసిసి అధ్యక్షులు హరి వర్ధన్ రెడ్డిని అభినందించారు. రాష్ట్రంలో డిసిసి,పిసిసి కమిటీలను సమన్వయ పరిచి రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహారెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు మాజీ కౌన్సిలర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సురవరం మృతి తెలంగాణకే తీరని లోటు

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి ఆగస్టు 24:** సురవరం సుధాకర్ రెడ్డి మరణం తెలంగాణకు తీరని లోటు సురవరం సుధాకర్ రెడ్డి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి మనోధైర్యం కల్గాలని కోరుకుంటున్న.. సురవరం జీవితాంతం రాజీపడని నిదారంభర జీవితాన్ని గడిపారు రాజీ లేని సిద్ధాంత పరమైన పోరాటం చేశారు ఏ నాడు సిద్ధాంతాలను వదలలేదు కింద స్థాయి కార్యకర్త నుంచి ఎంపీ గా వివిధ హోదాల్లో పనిచేసినా ఏ నాడు అహంకారం దరిదాపుల్లోకి కూడా రానివ్వలేదు తెలుగు యూనివర్సిటీ కి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని నాకు వారు లేఖ రాశారు